ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి జిల్లా వార్తలు
5★
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025





గోదావరిఖని సెక్రడ్ హార్ట్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో క్యూలో నిల్చున్న ఓటర్లు

- పట్టభద్రుల పోలింగ్ 68.50 శాతం
- ఉపాధ్యాయ పోలింగ్ 94.42 శాతం
- పోలింగ్ పూర్తయినా బారులు తీరిన ఓటర్లు
- ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసిన పలువురు అభ్యర్థులు

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం



ముత్తారం పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు



సుల్తానాబాద్ పోలింగ్ బూత్ వద్ద రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు బెనర్ మహేష్ దత్ ఎక్కా, కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 68.50 శాతం పోలింగ్ నమోదు కాగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 94.42 శాతం నమోదైంది. పట్టభద్రుల ఓటర్లు మొత్తం 31,037 మంది కాగా, 21,259 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 19,008 మంది పురుషులకు 13,098 మంది, 12,028 మందికి 8,160 మంది ఓట్లు వేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు మొత్తం 1,111 కాగా, 1,049 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఇందులో 647 మంది పురుషులకు గాను 611 మంది, 464 మంది మహిళలకు గాను 438 మంది ఓట్లు వేశారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు జరిగింది. ఉదయం నుంచి 11 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. బుధవారం మహాశివరాత్రి జరగడంతో చాలా మంది వేములవాడ, వేలాల జాతరలకు వెళ్లారు. అలాగే జాగారం చేసిన వాళ్లు ఆలస్యంగా పోలింగ్ బూతులకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12:30 గంటల నుంచి ఓటర్లు బారులు తీరారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం, గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు సాయంత్రం 4 గంటల వరకు చేరుకున్న వారిని లోపలికి అనుమతించిన పోలీసులు గేట్లు వేసి లైన్లకు పంపించారు. 4 గంటల తర్వాత కొందరు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చినప్పటికీ అనుమతించ లేదు. సుల్తానాబాద్, తదితర పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు మహేష్‌దత్‌ఎక్కా, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సందర్శించారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రామగుండంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ శ్రేణులు ఓటర్లను తమ అభ్యర్థులకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. పోలింగ్ ముగిసిన తర్వాత పోలింగ్ బాక్సులను కరీంనగర్ స్టేడియంలో గల ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూములకు తరలించారు.

పట్టభద్రుల నియోజకవర్గం	ఉపాధ్యాయుల నియోజకవర్గం
ఓటర్లు: 3,55,159	ఓటర్లు: 27,088
ఓటుహక్కు వినియోగించుకున్నవారు: 2,50,106 (70.42 శాతం)	ఓటుహక్కు వినియోగించుకున్నవారు: 24,895 (91.9 శాతం)
పురుషులు: 1,62,561 / మహిళలు: 87,544	పురుషులు: 15,743 / మహిళలు: 9,152

● ఓటర్లకు ప్రలోభాలతో ఎర..

జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పలువురు అభ్యర్థులు ప్రలోభాలతో ఎర వేశారు. పట్టభద్రుల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరపున కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటర్లకు వెయ్యి నుంచి 1500 రూపాయలు బుధవారం రాత్రి నుంచి పోలింగ్ జరిగే వరకు కూడా పంపిణీ చేశారని తెలుస్తున్నది. బీజేపీ అభ్యర్థి తరపున కొంత మంది ఓటర్లకు అంతే మొత్తం పంపిణీ చేశారని సమాచారం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థి తరపున 5 వేల చొప్పున, పీఆర్‌టీయూ అభ్యర్థి తరపున 3 వేల వరకు పంపిణీ చేసినట్లుగా ప్రచారం జరుగుతున్నది. నోట్ల పంపిణీ కారణంగానే పోలింగ్ శాతం పెరిగిందని తెలుస్తున్నది. ఆయా పార్టీల నాయకులు ఎవరికి ఎన్ని ఓట్లు పడి ఉంటాయని లెక్కలు వేసుకుంటున్నారు. పట్టభద్రుల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణగౌడ్‌ల మధ్య, ఉపాధ్యాయుల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొము రయ్య, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగల మహేందర్ రెడ్డిల మధ్యనే పోటీ నెలకొంది.

కమిషనరేట్ పరిధిలో ప్రశాంతంగా ఎన్నికలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగిందని కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జెడ్‌పీ హై స్కూల్, గోదావరిఖని సెక్రడ్ హార్ట్ హై స్కూల్ పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పోలీస్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163బీఎన్‌ఎస్ సెక్షన్ అమలు చేశామని, పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు మొత్తం 560మంది బందోబస్తులో పాల్గొన్నారన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లను కరీంనగర్‌లోని రెసిప్షన్ సెంటర్‌కు భారీ బందోబస్తు మధ్య చేరవేస్తున్నామన్నారు. కమిషనర్ వెంట అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, ఎస్‌బీ ఏసీపీ రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్ పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్



మంథని పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన పట్టభద్రులు



పెద్దపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించినఎమ్మెల్యే విజయరమణారావు



పాలకుర్తి కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్



కల్వశ్రీరాంపూర్‌లో బారులుదీరిన ఓటర్లు

వివరాలు 8లో

వేసవి నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు చర్యలు

- సింగరేణి ఇన్‌ఫిల్టరేషన్ గ్యాలరీ వైపు కందకాల తవ్వకం
- ఎల్లంపల్లి నీటిని వినియోగించుకునేందుకు చర్యలు

గోదావరిఖని, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వేసవిలో సింగరేణి ప్రాంతంలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. సింగరేణి కాలనీలకు నీటి సరఫరా చేసేందుకు గోదావరి మాత్రమే మార్గంగా ఉండడం, గోదావరినది ఎండిపోయిన పరిస్థితుల్లో గనుల నీటిని వాడుకోవాలని యాజమాన్యం భావించింది. మహాశివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఒత్తిడితో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం నీటిని దిగువకు విడుదల చేయడంతో గోదావరిలో ఉన్న ప్రవాహాన్ని నదిలోని సింగరేణి సంస్థకు చెందిన ఇన్‌ఫిల్టరేషన్ గ్యాలరీ వైపు మళ్లించే పనులను గురువారం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. ప్రొక్లైనర్ స్వయంగా నడుపుతూ నదిలో గ్యాలరీ వైపు కందకాలు తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలనీలకు ఎల్లంపల్లి నుంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోకుండా గత పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడంతో నదిలో నీరు లేని పరిస్థితి ఉందని, ఉన్న నీటిని ఒడిసి పట్టుకోవడమే మార్గంగా ఉందన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్టు రాజ్‌ఠాకూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఎస్‌ఈ వరప్రసాద్, నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



నదిలో కందకం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

సాగునీటి కాలువ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు గ్రామాలకు అందించే సాగు నీటి కాలువలను గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజిలు పరిశీలించారు. ముత్తా రం నుంచి అడవి శ్రీరాంపూర్ గ్రామానికి సాగునీరు వచ్చే కెనాల్ కొందరు భూ యజమానుల అభ్యంతరాల వల్ల నీళ్లు రావడంలేదని, రైతాంగానికి ఇబ్బంది అవు తుందని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు కెనాల్ వద్దకు వెళ్లి పరిశీలించి అడవి శ్రీరాంపూర్ రైతులకు సాగు నీటి సరఫరాపై మంత్రికి, ఉన్నతాధికారులకు తీసుకువెళ్లా రు. ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, గాదం శ్రీని వాస్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు తూటు రఫీ, గ్రామ శాఖ అధ్యక్షుడు అనుము సమ్మయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల శోభాయాత్ర



ఖనిలో హంసవాహనంపై శివపార్వతుల శోభాయాత్ర

సింగరేణిలో సీబీఎస్ఈ సిలబస్

ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు



గోదావరిఖని, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ బొగ్గుఉత్పత్తి ఉత్పాదతలపై దృష్టి సారించడమే కాకుండా సంస్థ పరిధిలో సింగరేణి విద్యాసంస్థలను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నది. ఈ దిశగా సంస్థ సీఎండీ బలరాం ఆదేశాలు జారీ చేశారు. సింగరేణి విద్యాసంస్థలను మరింత పటిష్టంగా తయారు చేసి మెరుగైన విద్య అందించేందుకు యాజమాన్యం దృష్టి సారించింది. పాఠశాల విద్య నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాలల వరకు విద్యాసేవలు అందిస్తున్నది. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మొత్తం 9 పాఠశాలలు, ఒక మహిళా జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ, పీజీ కళాశాల, ఒక పాలిటెక్నిక్ కళాశాల కొనసాగుతున్నాయి. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతో పాటు సౌకర్యాలు కల్పిస్తున్నది. 2024-25 విద్యా సంవత్సరం నుంచి సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాలకు న్యాక్ అక్రిడేషన్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తుండగా సింగరేణి కాలరీస్ హైస్కూల్ సెక్టార్-3 గోదావరిఖనిలో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రారంభం కానున్నది. అలాగే అన్ని సింగరేణి పాఠశాలలలో ఎన్‌సీసీ ప్రారంభించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంది.

కళాశాలల్లో కొత్త కోర్సులు...

సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాల, సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో కొత్త కోర్సులు రానున్నాయి. పాలిటెక్నిక్‌లో ఏఐఎంఎల్ అనే కొత్త కోర్సు ప్రవేశపెడుతున్నారు. సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు పెట్టుకుంది.

విద్యార్థుల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి

సింగరేణి కాలరీస్ విద్యాసంస్థలలో మెరుగైన విద్య, సౌకర్యాలు కల్పించడంతోపాటు విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టి సారిస్తున్నది. అధ్యాపకులు, ఉపాధ్యాయులను పలు విద్యాసంస్థలకు పంపి అధ్యయనం చేసి సింగరేణిలో ఆచరణలో పెట్టేందుకు చర్యలు తీసుకొంటోంది. ప్రధానంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. తల్లిదండ్రులతో పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించి గైర్హాజరును నివారించేందుకు, సమయపాలన పాటించడం, శిక్షణ పద్ధతులు, లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నది.

సింగరేణి విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులకు టీచర్స్ యాప్‌ను తీసుకువచ్చింది. ఐటీ ప్రవర్తక్ కెరీర్ కౌన్సెలింగ్ శిక్షణ ఇవ్వడంతోపాటు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్త మార్పులకు శ్రీకారం చుట్టడంపై సింగరేణి కార్మిక, కార్మికేతర కుటుం బాల్లో హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతుడు దేవరాజు

ముస్తాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన ఒల్లెపు దేవరాజు(30) అనే వ్యక్తి వ్యవసాయ బావిలో పూడిక తీత పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌లోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో దేవరాజు పూడికతీత పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడున్న వారు వెంటనే అతన్ని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దేవరాజుకు భార్య లలిత, ఇద్దరు పిల్లలున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


లక్ష్మీనర్సు(ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన అరె లక్ష్మీనర్సు(54) అనే రైతు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. గ్రామానికి చెందిన లక్ష్మీనర్సు అనే రైతు కొన్ని రోజుల క్రితం పొలం వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ పోవడంతో వేద్దామని ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాడు. ప్రమాదవశాత్తు షాక్ రావడంతో సిద్దిపేటలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లక్ష్మీనర్సుకు భార్య భూలక్ష్మీ, కొడుకు నవీన్‌లున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ మంత్రి రాజం విజ్ఞప్తి చేశారు.

కొడుకును కాపాడబోయి తల్లికి గాయాలు..

కోనరావుపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నాగారంలో కుమారుడు విద్యుదాఘాతానికి గురికావడంతో కాపాడబోయిన తల్లి విద్యుదాఘాతానికి గురైంది. నాగారం గ్రామంలో విద్యుత్ మెయిన్ వైరు తెగి కింద పడిపోగా ఇంటి ముందు ఆడుకుంటూ వెళ్లిన అద్విక్ తీగను పట్టుకున్నాడు. గమనించిన తల్లి సుమ వైరును తొలగించే ప్రయత్నం చేయగా షాక్ తగిలి కింద పడిపోయింది. గ్రామస్థులు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. అక్కడ తల్లీకొడుకులు చికిత్స పొందుతున్నారు.

హత్యకు గురైన వ్యక్తి గుర్తింపు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం చంద్రంపేటలోని రాఘవేంద్ర రైస్‌మిల్ వెనుకాల దారుణ హత్యకు గురైన వ్యక్తి సిరిసిల్ల పట్టణానికి చెందిన బూస రమేశ్ (45)గా కుటుంబ సభ్యులు గురువారం గుర్తించారు. టౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. సంఘటనా స్థలంలో పడిఉన్న వస్తువుల ఆధారంగా ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం సేవించినట్లు ఉంది. మద్యం మత్తులో రమేశ్‌ను తలపై బండరాయితో మోది హత్యచేసినట్లు తెలుస్తోంది. రమేశ్‌పై పలు దొంగతనం కేసులు ఉన్నాయి. జులాయిగా తిరిగే రమేశ్‌ను ఎవరు హత్యచేసి ఉంటారనేది తెలియాల్సి ఉంది. రమేశ్‌కు భార్య లావణ్య, కుమార్తె రచన, కుమారుడు మల్లికార్జున్ ఉన్నారు. పోలీసులు కుటుంబ సభ్యుల స్టేట్‌మెంట్ రికార్డు చేసుకొని మార్చురీలో ఉన్న మృతదేహాన్ని అప్పగించారు. డాగ్ స్క్వాడ్ ఆధారంగా హంతకుల కోసం గాలింపు చేపట్టామని, మరోవైపు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులతో భర్తకు జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్‌ఐ గణేశ్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం... సిద్దిపేట మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన వనమా యాదగిరికి ముస్తాబాద్ గ్రామానికి చెందిన వనమా లక్ష్మితో 1996 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత యాదగిరి అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేసేవాడు. వేధింపులు భరించలేక 2015 సంవత్సరంలో లక్ష్మి ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వనమా యాదగిరిపై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో అప్పటి ఎస్‌ఐ మారుతి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదించగా సిఎంఎస్ ఎస్‌ఐ శ్రావణ్ కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఐదుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ నిందితునికి ఏడాదిన్నర జైలుశిక్షతో పాటు రూ. 3వేల జరిమానా విధించారని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జాన్ ప్రకాష్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పెద్దపల్లి పట్టణం క్రిస్టియన్ కాలనీకి చెందిన వల్లెపు జాన్ ప్రకాష్‌తోపాటు వరుసకు సోదరుడైన కరుణాకర్‌లు డిగ్రీ పరీక్షలు రాయడానికి ఉదయం ఏడున్నర గంటలకు బైక్‌పై పెద్దపల్లి నుంచి బయలుదేరారు. సుల్తానాబాద్‌లో కొయ్యడ భాను అనే మరో మిత్రుడిని బైక్‌పై ఎక్కించుకుని ముగ్గురు కరీంనగర్ వెళ్తుండగా దుబ్బపల్లి వద్ద యూటర్న్ తీసుకుంటున్న లారీని ఢీకొన్నారు. ఈ సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా వీరిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. వీరిలో జాన్‌ప్రకాష్ బైక్ నడుపుతుండగా తీవ్ర గాయాలపాలయ్యాడని, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గురువారం మరణించాడని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళ అంబటి అమృత(52) ప్రమాదానికి గురై కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 25న మృతిచెందింది. ఆమె రెండో కూతురు స్రవంతి అమెరికాలో ఉండడంతో అంత్యక్రియలు నిర్వహించకుండా వేచిచూడాల్సి వచ్చింది. గురువారం కూతురు స్వగ్రామానికి చేరుకోవడంతో అమృత అంత్యక్రియలను నిర్వహించారు. మృతురాలికి భర్త రాజేందర్, కూతుర్లు సుమతి, స్రవంతి, మానసలు ఉన్నారు.

ప్రమాదానికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్‌కు జైలు శిక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు 20 నెలల జైలుశిక్ష, 4 వేల జరిమానా విధిస్తూ గురువారం గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నల్లాల వెంకట సచిన్‌రెడ్డి తీర్పునిచ్చారు. 2016 నవంబరు 19న అల్లూరు సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరి మండలం లద్నాపూర్ గ్రామానికి చెందిన పొన్నంగౌడ్(48) అనే గీత కార్మికుడు మృతి చెందాడు. పొన్నంగౌడ్ భార్య పద్మతో కలిసి ద్విచక్ర వాహనంపై బొక్కలగుట్టకు వెళ్లి తిరిగి వస్తుండగా అల్లూరు సమీపంలో భీమగోని విద్యాసాగర్ వేగంగా ట్రాక్టర్ నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. మృతుడి బావమరిది పులిబాపు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీస్ సిబ్బందిని రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ చేతన, ఏసీపీ మడక రమేష్ అభినందించారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

బీర్‌పూర్,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పశువులను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ అరగుండాల ప్రాజెక్టులో పడి పశువులు కాపరి మృతి చెందినట్లు ఏఎస్సై రవీందర్ గురువారం తెలిపారు. ఏఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన ఉయ్యాల రాజయ్య(60) అనే పశువుల కాపరికి ఎవరూ లేకపోవడంతో తన సోదరుడి వద్ద ఉంటూ పశువులను కాస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి పశువులను మేపడానికి వెళ్లిన రాజయ్య సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తన తమ్ముడు చంద్రయ్య తన కుమారుడు ఉదయ్ కలిసి బుధవారం రాత్రి, గురువారం గాలించగా మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో అరగుండాల ప్రాజెక్టులో మృతదేహం కనిపించింది. ఈత రాక మృతిచెంది ఉంటాడని రాజయ్య సోదరుడు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యూరియా కోసం ఇబ్బందులు

● గొల్లపల్లిలో గోదాంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం ● ఆలూరులో బారులు తీరిన రైతులు ● పైడిమడుగులో కొరతతో ఆందోళన

గొల్లపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలంలో యూరి యా కోసం గురువారం రైతులు ఆందోళన చేశారు. గొల్లపల్లి సింగిల్‌విండో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు పలువురు రైతులు యత్నించడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు, జిల్లా వ్యవసాయ అధికారి సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. గురువారం సింగిల్‌విండో కార్యాలయానికి 350 యూరియా బస్తాలు వచ్చాయనే సమాచారంతో రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో కొంత మంది రైతులకు టోకెన్లు అందజేశారు. టోకెన్లు అందని రైతులు యూరియా కావాలంటూ ఒక్కసారిగా గోదాంలోకి దూసుకు పోయేందుకు ప్రయత్నించారు. సమయం దాటాక ఇచ్చే యూరియా మాకెందుకు అంటూ పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎస్సై చిర్ర సతీష్ కుమార్ సంఘటనాస్థలికి వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి రాంచంద్రం అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు సరిపడా యూరియాను అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. అనంతరం టోకెన్లు పొందిన రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. సింగిల్‌విండో సీఈవో బెజ్జెంకి రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ ఐదు లారీల లోడ్‌లకు డబ్బులు చెల్లించామన్నారు. రెండు లారీల యూరియా పంపించారని, దీంతో రైతులు పెద్దఎత్తున రావడంతో కొంత గందరగోళం ఏర్పడిందన్నారు. టోకెన్ ప్రకారం ఒక్కో రైతుకు రెండేసి బస్తాల చొప్పున అందజేశామన్నారు.

● **రాయికల్:** మండలంలోని ఆలూరు గ్రామంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. గ్రామంలోని సహకార కేంద్రంలో రైతులకు సరిపడా ఎరువులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానిక రైతులు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో రైతులు వారి ఆధార్ కార్డులు, పాస్ బుక్‌లను క్యూలైన్‌లో పెట్టి వేచి చూస్తున్నారు. ప్రభుత్వం కావాల్సిన ఎరువులను సరఫరా చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.


గొల్లపల్లి సింగిల్ విండో వద్ద రైతులు


పైడిమడుగులో బారులు తీరిన రైతులు, క్యూలో చెప్పులు


పైడిమడుగులో లైనులో ఉంచిన పాస్‌బుక్కులు

● **కోరుట్ల రూరల్:** మండలంలోని పైడిమడుగు గ్రామంలోని సహకార సంఘ భవనం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. చెప్పులు క్యూలో పెట్టుకున్న రైతులు యూరియా కొరకు ఎదురు చూశారు. సింగిల్ విండో కార్యాలయం వద్ద గురువారం ఉదయం రైతులు భారీగా చేరుకున్నారు. యూరియా పంపిణీ చేస్తున్న సయమంలో కేంద్రం వద్ద రైతులు భారీగా చేరడంతో సందడిగా మారింది. సుమారు 400 బ్యాగులు రైతులకు అవసరం ఉండంగా 125 బ్యాగులు రావడంలో ఆవేదన వ్యక్తం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణ షాపు దగ్ధం

రూ. 8 లక్షల నగదు, రూ. 30 లక్షల సామగ్రి ఆహుతి

మంథని రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగులో గురువారం తెల్లవారుజామున శివశంకర్ కిరాణం, అండ్ జనరల్ స్టోర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన ఊదరి శంకర్ కిరాణ దుకాణంలో మంటలు చెలరేగి నగదుతో పాటు షాపులోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బుధవారం శంకర్ షాపు మూసివేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో షాపులో మంటలు చెలరేగడంతో స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మంథని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన తరలివచ్చి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఇంటి మరమ్మతు కోసం అప్పుగా తెచ్చుకున్న రూ.7.80 లక్షల నగదుతోపాటు కౌంటర్‌లో ఉన్న రూ.30 వేలు దగ్ధమైనట్లు బాధితుడు శంకర్ తెలిపారు. సామగ్రి పూర్తిగా దగ్ధమై రూ.30 లక్షల వరకు నష్ట వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


అగ్నిప్రమాదంలో దగ్ధమైన దుకాణాన్ని పరిశీలిస్తున్న పుట్ట మధు

పాము కాటుతో రైతు మృతి

చొప్పదండి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేట పరిధిలోని బీరంరాజయ్యపల్లికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి(44) గురువారం పాముకాటుతో మృతిచెందాడు. రేవెల్లి శివారులో తన పొలంలో మల్లారెడ్డి పనిచేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే అతన్ని మొదట చొప్పదండి పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మల్లారెడ్డి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు.

ఇసుక డంప్‌ని పట్టుకున్న పోలీసులు

● ఐదుగురిపై కేసు నమోదు, వాహనాలు సీజ్


ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఓదెల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల శివారు నుంచి ఇసుక అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీని, డంప్ చేసిన ఇసుకను పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ బుధవారం రాత్రి పట్టుకున్నారు. పెద్దిరెడ్డి జనార్దన్ రెడ్డి, మణిదీప్, పొన్నగంటి సురేష్, కోరి భాస్కర్, రాజన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, గుంపుల పెట్రోల్ బంక్ పక్కన గల రైస్‌మిల్లు స్థలంలో అనుమతులు లేకుండా ఇసుక నిల్వ చేశారన్నారు. హైదరాబాద్‌కు తరలించడానికి లారీలో ఇసుక లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిలువ చేసిన దాదాపు 20 ట్రాక్టర్ల ఇసుకపై తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చామని, కొందరు నేరస్తులు ఊక, ఇసుకను కలిపి కంటైనర్ లారీలో తరలిస్తుండగా పట్టుకొన్నామన్నారు.

ఎలాంటి అనుమతులు లేకుండా, ఎవరైనా ఇసుకను అక్రమంగా నిలువ చేసినా, తరలిం చినా చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ రమేష్ హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బోల్తా పడిన లారీ.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడికల్ శివారులో అదుపు తప్పి ఉనుక లారీ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఉనుక లారీ అదుపుతప్పి గురువారం బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

● పట్టించుకోని అధికారులు ● సౌకర్యాలు లేక చిన్నారుల అవస్థలు


ఎల్లారెడ్డిపేటలో నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రం-6 అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇరుకైన గదులు, గాలి, వెలుతురు లేక ఉక్కపోత నడుమ చిన్నారులకు అవస్థమయంగా మారింది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం అసంపూర్తిగా నిలిచిపోయింది. పనులను చేపట్టిన గుత్తేదారు పూర్తి స్థాయిలో చేయకపోవడం వల్ల వినియోగంలోకి రాకుండా పోయింది. తలుపులు తెరచి ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోంది. మద్యం దుకాణానికి సమీపంలోనే అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనంలో మందుబాబులు నిత్యం మద్యం సేవిస్తున్నారు. ఖాళీ మద్యం సీసాలను అక్కడే పడేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తుండడంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. ఆటపాటలతో కళకళలాడాల్సిన కేంద్రం ఖాళీ మద్యం సీసాలతో దర్శనమిస్తోంది. పనులను పూర్తి చేయించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కేంద్రానికి నిధులు మంజూరు చేసిన పర్యవేక్షణ లేక అసంపూర్తిగా మిగిలిపోయిందని వాపోతున్నారు. కేంద్ర భవనంలో అసాంఘీక కార్యకలాపాలు సాగుతున్న పోలీసులు దృష్టి సారించకపోవడం ఏమిటనీ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కేంద్రం భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చి అద్దె భవనంలో కొనసాగుతున్న కేంద్రాన్ని స్వంత భవనంలోకి మార్చాలని కోరుతున్నారు.

ఎన్నికల తర్వాత పనులు పూర్తి చేయిస్తాం

- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-6 భవనం అద్దె గదిలో కొనసాగుతోంది. యేడాది కిందట మంజూరైన నిధులతో పనులను ప్రారంభించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల అనంతరం పనులను పూర్తి చేయిస్తాం. చిన్నారులకు వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు చేపడుతాం.

అలంకారప్రాయంగా రైతు వేదికలు

● ఊరికి దూరంగా.. మందుబాబులకు అడ్డాగా
● నిరుపయోగంగా మారుతున్న కేంద్రాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు అలంకార ప్రాయంగా మారాయి. మరుగుదొడ్లు నిర్మించినా నీటి సౌకర్యం లేక అలంకారప్రాయంగా మిగిలాయి. ఊరికి దూరంగా నిర్మించడంతో కొన్ని రైతు వేదికలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. పాలకుర్తి మండలంలోని మూడు రైతువేదికల పరిస్థితిపై ప్రత్యేక కథనం.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షలు వెచ్చించి రైతువేదికలను నిర్మించింది. వ్యవసాయశాఖ అధికారులు అందుబాటులో ఉండేందుకు, సమకాలీన సాగు అంశాలపై ఎప్పటికప్పుడు రైతులతో సమావేశమయ్యేందుకు వీలుగా రైతువేదికలను ఏర్పాటుచేశారు. అయితే ఆ లక్ష్యం నెరవేరడం లేదు. ఎల్కలపల్లి, జయ్యారం, కుక్కలగూడూర్ పేరిట మండలంలో మూడు క్లస్టర్లు మంజూరయ్యాయి. జయ్యారం, ఎల్కలపల్లిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పుట్నూర్, పాలకుర్తిలో, కుక్కలగూడూర్‌లో రైతువేదికలు నిర్మించారు. మూడు రైతువేదికకు ప్రహరీ పూర్తి కాలేదు. గుత్తేదారులు నాసిరకంగా పనులు చేపట్టడంతో పగుళ్లు చూపుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయి. మంచినీటి సౌకర్యం లేదు. కుర్చీలు, బల్లలు, బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. కానీ నీటి వసతి కల్పించలేదు. గ్రామాలకు దూరంగా ఉండడంతో ఆయా పంచాయతీల పరిధిలోని రైతులు అక్కడకు వెళ్లడం లేదు. నిర్వహణ లేకపోవడంతో రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సమావేశాలు నిర్వహించకపోవడంతో అవి నిరపయోగంగా మారాయి.

● మండలంలో వ్యవసాయశాఖ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ఆ శాఖ అధికారులు రైతువేదికలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో మహిళా ఉద్యోగులతో పాటు మహిళా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వేదికల వద్ద మౌలిక వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.


పాలకుర్తిలోని రైతు వేదిక


పుట్నూర్ రైతు వేదిక వద్ద నిరపయోగంగా మరుగుదొడ్లు

రైతు వేదికల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

బొడ్డు రాయమల్లు రైతు, కుక్కలగూడూర్

మండలంలో నిర్మించిన మూడు రైతువేదికల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామాలకు దూరంగా, కనీసం రోడ్డు సౌకర్యం కల్పించకుండానే రైతువేదికలు ప్రారంభించడంతో నిరుపయోగంగా మారాయి. తాగు నీటి సౌకర్యంతో పాటు రోడ్డు నిర్మాణం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాడుకలోకి తీసుకురావాలి.

వెళ్లొస్తాం రాజన్నా..

వచ్చే ఏడాది మళ్లీ వస్తాం..



- స్వగ్రామాలకు తిరుగుప్రయాణమైన రాజన్న భక్తులు
- పిల్లాపాపలు, పాడిపంటలను చల్లగా చూడాలని మొక్కులు
- ముగిసిన మూడు రోజుల రాజన్న మహాశివరాత్రి వేడుకలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వెళ్లొస్తాం రాజన్నా.. పిల్లాపాపలు, పాడి పంటలను చల్లగా చూడు.. అందరని క్షేమంగా చూస్తే మళ్లీ వచ్చే ఏడాదికి మళ్లీ నీ సన్నిధికి వచ్చి జాగరణ ఉపవాస దీక్ష చేస్తామంటూ భక్తులు వేములవాడ నుంచి స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో మూడు రోజులపాటు నిర్వహించిన మహాశివరాత్రి జాతర విజయవంతంగా ముగిసింది. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలతో పాటుగా పట్టణ పురవీధులు మూడు రోజులుగా రద్దీగా మారాయి. భక్తులు బుధవారం రాత్రి రాజన్న ఆలయ గుడి చెరువులోని పార్కింగ్ స్థలంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల కింద ఎంతో నిష్టతో రాత్రంతా జాగరణ చేసి తెల్లవారి నైవేద్యం పెట్టి దీక్షను విరమించారు.



బద్ది పోచమ్మకు మొక్కులు..

జాగరణ అనంతరం భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అదనంగా క్యూలైన్‌లు ఏర్పాటు చేయడంతో త్వరగా అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించారు. పట్నాలు వేసి ఒడిబియ్యం పోసి నైవేద్యం సమర్పించి తిరుగు ప్రయాణమయ్యారు.

బియ్యంతో నిండిపోయిన కోటి లింగాలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి దక్షిణం వైపున్న కోటి లింగాలకు భక్తులు ఒడి బియ్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే మహాశివ రాత్రి జాతరకు లక్షల మంది జనం రావడంతో భక్తులు సమర్పించిన ఒడిబియ్యంతో విగ్రహాలు బియ్యంలో కూరుకు పోయాయి. ఆలయ సిబ్బంది ఎప్పటికప్పుడు బియ్యాన్ని తొలగించిన భారీగా తరలివచ్చిన భక్తుల తాకిడికి కోటి లింగాలు బియ్యంతో నిండిపోయి కనిపించాయి. కాగా రాజన్న ఆలయానికి దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు తన బంగారు చైన్ పోగొట్టుకోవడంతో పార్వతిపురం ధర్మశాలలోని పారిశుధ్య విభాగం సిబ్బందికి దొరకడంతో తిరిగి భక్తులకు అందజేశారు. నిజాయితీని చాటుకున్న సిబ్బందిని ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అభినందించారు.

ధర్మగుండంలో తొలగించని వ్యర్థాలు..

మహాశివరాత్రి జాతరకు వచ్చిన భక్తులు బుధవారం రాత్రి రాజన్న ఆలయ ధర్మగుండంలో జాగరణ కోసం పండ్లు, పూలతో దీపాలను వెలిగించారు. గురువారం మధ్యాహ్నం వరకు వ్యర్థాలను సిబ్బంది తొలగించకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుం డా శివదీక్ష తీసుకున్న శివస్వాములు తాము ధరించిన దుస్తువులను రాజన్న ఆలయ ధర్మగుండంలో వదిలివెళ్లగా సిబ్బంది తొలగించక పోవడంతో అలాగే ఉండిపోయాయి.

శివమయమైన వేములవాడ క్షేత్రం..

రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం బుధవారం శివమయంతో నిండిపోయింది. పట్టణ పురవీధులతో పాటు ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రాజన్న క్షేత్రంలో నిర్వహించిన మహాశివరాత్రి జాతర ఎంతో వైభవోపేతంగా నిర్వహించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు. సుమారుగా 2 లక్షల 55 వేలకు పైగా భక్తులు గురువారం మధ్యాహ్నం వరకు వచ్చినట్లు అంచనా వేస్తున్నాం. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయడం సంతోషంగా ఉంది. జాతర విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అన్ని శాఖల అధికారులతో పాటుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు, రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదం అందజేయడంతో ఎక్కడ లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన ఏఈవో శ్రావన్‌కుమార్‌కు, ప్రొటోకాల్ ఏఈవో అశోక్, సూపరిండెంట్ శ్రీకాంతచారి, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ యాదవ్, ఎడ్ల శివసాయి, పురాణం వంశీ, జూనియర్ అసిస్టెంట్ సంహాచారిలకు ప్రత్యేక ధన్యవాదాలు.



సరిపోని చలువ పందిళ్లు..

మహాశివరాత్రి జాతరకు అనుకున్న దానికంటే ఎక్కువ మంది తరలిరావడంతో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్ల సరిపోలేదు. దీంతో భక్తులు గుడి చెరువులోని ఖాళీస్థలాల్లో వెంట తీసుకువచ్చిన పరదాలతో టెంట్‌లను ఏర్పాటు చేసుకుని విడిది చేశారు. మరికొంత మంది భక్తులు రాజన్న గుడి చెరువలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్స్‌ను సపోర్టు చేసుకుని పరదాలను కట్టుకుని ఎండతగలకుండా విడిది చేసి వంటలు చేసుకున్నారు.





స్వామివారి దర్శనానికి క్యూలో వెళుతున్న భక్తులు, వేములవాడ నుంచి తిరుగు ప్రయాణమవుతూ..

శివపార్వతుల శోభాయాత్ర



కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పార్వతీ రాజరాజేశ్వరస్వామి కల్యాణోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి గోదావరిఖని కోదండ రామాలయం నుంచి శివపార్వతుల ఉత్సవవిగ్రహాల శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో, సిబ్బంది, ప్రధానఅర్చకుల అత్తెణ చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో శోభాయాత్ర కొనసాగింది. కేరళ డప్పు చప్పుళ్లలతో విద్యుత్ కాంతులతో హంసరథంలో కొనసాగిన యాత్ర విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్నారు.

వేలాల మల్లన్నస్వామి జాతరకు తరలిన భక్తులు

మంథని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వేలాలలో కొలువై ఉన్న మల్లికార్జునస్వామి (మల్లన్న) జాతరకు మంథని ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు గురువారం తరలి వెళ్లారు. మంథని నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన భక్తులు వేలాలలో జరిగే మల్లన్నస్వామి జాతరకు ఆర్టీసి బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లారు. మహాశివరాత్రి సందర్భంగా వేలాలలో జరిగే మల్లన్నస్వామి జాతరకు ఈప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్ళి మొక్కులు చెల్లించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు, పట్నాలు, బోనాలు సమర్పిస్తారు.

చెన్నకేశవనాథ స్వామి రథోత్సవం



రాయికల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శ్రీ చెన్నకేశవనాథ స్వామి ఆలయంలో స్వామివారి రథోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం ఉత్సవ విగ్రహాలైన శివపార్వతులను రథంపై ఉంచి ఆలయం చుట్టూ ఐదుసార్లు తిప్పారు. రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయంలో భక్తుల సందడి



దుబ్బరాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

సారంగాపూర్, ఫిబ్రవరి, 27 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలోని దుబ్బరాజన్న క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. అర్చకులు స్వామి వారికి అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి గొడిసెల రాజేశం, సినీ వ్యాపారవేత్త మానాల పుల్లయ్య, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, బాపురెడ్డిలు దర్శించుకున్నారు. శుక్రవారం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తారు.

ఘనంగా సాంబశివ రథోత్సవం



బుగ్గారం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండల కేంద్రంలోని సాంబశివ నాగేశ్వర దేవాలయంలో రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ భక్తులు రథాన్ని పూలమాలలతో అలంకరించి శివ భక్తులు, మహిళలు, దీక్ష స్వాములు రథమును లాగారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో నాయకులు బాధినేని రాజేందర్, వేముల సుభాష్, గాలిపెల్లి మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ మసర్థి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురిలో..



ధర్మపురిలో అక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి రథోత్సవం

ధర్మపురి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి, శ్రీ రామలింగేశ్వరస్వామి, నేరెళ్ల, జైనాలో శ్రీసాంబశివుడి రథోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శివ పార్వతుల ఉత్సవ మూర్తులను అక్కపెల్లి ఆలయం నుంచి గాంధీ చౌక్ మీదుగా నంది విగ్రహ చౌరస్తా వరకు ఊరేగించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం జరిపారు. కార్యక్రమంలో వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, ఆలయ అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ, జన్మంచి శ్రీనివాస్, బూస ప్రవీణ్ కుమార్, ద్యావళ్ల ప్రసన్న కుమార్, పర్వతగిరి ప్రశాంత్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సీపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెగడపల్లిలో ..



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారి రథోత్సవ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం శివదీక్షాపరులు, భక్తులచే స్వామి వారి గ్రామ సందర్శనం శోభాయాత్ర నిర్వహించారు. రుద్ర హవనం, జయాదులు, బలిప్రధానం, మహాపూర్ణాహుతి, అన్నపూజ నిర్వహించి 6 వేల మందికి జాల తిరుపతి రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో భక్తులకు అన్న, ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, గుండి రాజేశ్వర శర్మ, శ్రీనివాస్ శర్మ, వినయ్ శర్మ, రాఘవ శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూకంటికి కొలుకలూరి సాహితీ పురస్కారం ప్రదానం



అవార్డును ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ వరప్రసాద్

సిరిసిల్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కథా రచయిత, కవి, విమర్శకులు జూకంటి జగన్నాథంకు జాతీయస్థాయి కొలుకలూరి భగీరథ కవితా పురస్కారం-2025 ప్రదానం చేస్తూ ఘనంగా సన్మానించారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో కొలుకలూరి పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. సాహిత్య రంగంలో విశేషంగా కృషి చేస్తున్న జూకంటి జగన్నాథం రచించిన 'ఒక కప్పు ఛాయ్... నాలుగు మేసేజ్‌లు' కావ్య సంపుటికి కొలుకలూరి పురస్కారాన్ని ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్, ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌ఛాన్స్‌లర్ మధుజ్యోతి, సుమకిరణ్‌లు పురస్కారాన్ని అందించి సత్కరించారు.

జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు తల్లీకూతుళ్ల ఎంపిక


కరీంనగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాకు చెందిన తల్లీకూతళ్లు మేరి స్టెల్లా, షీలాస్మృతి జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో బుధవారం మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్స్ పోటీల్లో 50 ఏళ్ల పై వయస్సు విభాగంలో తల్లి మేరి స్టెల్లా జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో స్వర్ణ పతకాలు, 100 మీటర్ల పరుగుపందెంలో రజతం సాధించింది. కూతురు షీలాస్మృతి 30 ఏళ్ల పై వయస్సు విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో రజతం, 200 మీటర్ల పరుగు పం దెంలో కాంస్యం సాధించింది. ఏప్రిల్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొననున్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి రామారావు, రూబెన్‌మార్క్, సుధీర్, దేవదానం, డేనియల్, సుదర్శనం, జాన్సన్ అభినందనలు తెలిపారు.



ప్రశంస పత్రాలు అందుకుంటున్న తల్లీకూతుళ్లు మేరి స్టెల్లా, షీలాస్మృతి

పరిశోధన ఫలాలు సమాజానికి

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



గణేశ్‌నగర్,ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్రం మన జీవితాల్లో వెలుగులు నింపుతోంది. సీవీ రామన్ ఫిబ్రవరి 28, 1928న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భౌతిక శాస్త్రంలో సరికొత్త అధ్యయనానికి నాంది పలికారు. ఆ ఆవిష్కరణకు గుర్తుగా ఫిబ్రవరి 28ను 1986 నుంచి జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ప్రతి సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఒక నిర్దిష్ట అంశం (థీమ్), కొత్త ఆవిష్కరణ లేదా సాంకేతికత ఆధారంగా జరుపుకుంటారు. ఈ సంవత్సరం 'వికసిత్ భారత్‌కీ సైన్స్, ఆవిష్కరణల్లో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత' అనే అంశంపై జరుపుకుంటున్నారు. ప్రస్తుతం మన దేశం సైంటిఫిక్ రీసెర్చ్ పబ్లికేషన్‌లో ప్రపంచవ్యాప్తంగా మొదటి ఐదు దేశాల్లో ఒకటిగా ఉంది. ఇన్నోవేషన్ ఇండెక్స్ 40వ స్థానంలో ఉంది. చంద్రుడి దక్షిణ ధ్రువం పైకి విజయవంతంగా చేరిన తొలి దేశంగా భారత్ నిలిచింది.

వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు

అన్నదాతలకు సహాయకారిగా ఉండేందుకు శాస్త్ర వేత్తలు ఎన్నో ఆవిష్కరిణలు చేస్తున్నారు. తక్కువ పరిమాణంలో ఉండే నానో యూరియాతో రైతులకు మేలు జరుగుతోంది. సమర్థవంతమైన నానా యూరి యా ఉంటూ పర్యావరణహితంగా సమర్థవంతమైన పాత్ర పోషిస్తుంది. పురుగుల మందులు పిచికారి చేసే డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతు లకు డబ్బులు, సమయం ఆదా అవుతోంది.

విద్యారంగంలో...

కొవిడ్ సమయంలో ఆన్‌లైన్‌లో పాఠాలు కొత్త అధ్యాయనాన్ని ప్రారంభిం చాయి. ఈ విధానంతో ప్ర పంచవ్యాప్తం గా ఉన్న విషయాలను తెలుసుకునే అవకాశం కలిగింది. వర్చువల్ రియాలిటీ, డిజిటల్ బోర్డులు మొదలైన పరికరాల ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకుంటున్నారు.

పర్యావరణ పరిరక్షణ

పెరుగుతున్నకాలుష్యం, వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత వంటి సమస్యలు మన భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నేపథ్యంలో శాస్త్రవేత్తలు పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం నూతన ఆవిష్కరణలకై పరిశోధనలు చేస్తూనే ఉన్నారు ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచవ్యాప్తం గా తీవ్ర సమస్యగా మారింది. శాస్త్రవేత్తలు ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడానికి కొత్త పద్ధతులు కను గొంటున్నారు. జలసౌర, పవన విద్యుత్ పునరుత్పాద క ఇంధన వనరులు వినియోగం పెరుగుతుంది.

రవాణా రంగంలో..

వేగవంతమైన, సురక్షితమైన పర్యావరణ అనుకూ లమైన రవాణా వ్యవస్థల కోసం శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో ఎంతో కీలకంగా మారాయి. బ్యాటరీ టెక్నాలజీలో పురోగతి, చార్జింగ్ స్టేషన్ల విస్తరణతో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగిం ది. ప్యానెల్స్ ద్వారా ద్వారా చార్జింగ్ సౌకర్యం, వైర్లెస్ చార్జింగ్ వంటివి అందుబాటులోకి వస్తున్నాయి. డ్రైవర్ లేని వాహనాలు రవాణా రంగంలో పెద్ద మార్పులు తెస్తున్నాయి.

కృత్రిమ మేధస్సు

ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం శర వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ అభివృద్ధిలో కృత్రి మ మేధసు ముఖ్యపాత్ర పోషిస్తున్నది.కృత్రిమ మేధ స్సు అనేది కంప్యూటర్, యంత్రాలు మానవుల వలె ఆలోచించి, నేర్చుకొని, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని కలిగి ఉండే ఒక సాంకేతికత. ఇది వివిధ రంగాల్లో అనేక శాస్త్రీయ ఆవిష్కరణలకు దారి తీసిం ది. వైద్య రంగంలో కృత్రిమ మేధస్సు చాలా ఉపయోగపడుతోంది.

సైన్స్ మన జీవితంలో ఒక భాగం

డాక్టర్ తిరుపతి, వృక్షశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్



సైన్స్ మన జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. ఇది మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరించడానికి అదేవిధంగా కొత్త ఆవిష్కరణలు చేయడానికి సహాయపడుతుంది. జాతీయ సైన్స్ దినోత్సవం అనేది కేవలం ఒకరోజు కాదు, ఇది శాస్త్ర విజ్ఞానం పై మనకున్న నిబద్ధతకు ప్రతీక. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించ డానికి, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొం దించుకోవడానికి ఈ దినోత్సవం స్ఫూర్తినిస్తుంది.


ధర్మారంలో కార్యకర్తలతో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్


గోదావరిఖనిలో పోలీసులతో బీజేపీ నాయకుల వాగ్వాదం


సుల్తానాబాద్‌లో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అభివాదం చేస్తున్న నరేందర్‌రెడ్డి


ఎలిగేడులో ఓటుహక్కును వినియోగించుకుంటున్న పట్టభద్రులు

సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికలు

పెద్దపల్లి టౌన్/పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పట్టభద్రుల, టీచర్స్ ఎన్నికలు సజావుగా ముగిశాయి. జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలో 6 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మహేష్ దత్ ఎక్కా పరిశీలించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించి ఓటర్లను 4 గంటల లోపు అనుమతి ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐలు లక్ష్మణ్‌రావు, మల్లేష్ బందోబస్త్ నిర్వహించారు.

సుల్తానాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల సరళి ప్రశాంతంగా కొనసాగిందని ఎమ్మెల్సీ ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెనర్ మహేష్ దత్ ఎక్కా అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. బ్యాలెట్ బాక్సులను తరలించేందుకు ఉన్న వాహనాన్ని పరిశీలించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా ఫారెస్ట్ అధికారి, మాడల్ కోడ్ అఫ్ కండక్ట్ జిల్లా అధికారి నాగయ్య, తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ ఉన్నారు.

మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 3461, టీచర్స్ ఓటర్లు 127 మంది ఉన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ ఓటు ఎక్కడ ఉందో తెలియక తికమకపడ్డారు. పోలింగ్ గదుల నంబర్లు చెప్పడంలో, అవి ఎక్కడ ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఓటు వేసేందుకు లైన్‌లో ఉన్న వారిని కలుసుండగా తహసీల్దార్ అడ్డుకుని బయటకు వెళ్లాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల తీరును ఎమ్మెల్యే విజ యరమణారావు పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్‌రావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ బందో బస్తు నిర్వహించారు.

ఎలిగేడు: మండలంలో మొత్తం 882మంది పట్టభద్రులు, 13మంది ఉపాధ్యాయుల ఓట్లు ఉన్నాయి. 665మంది పట్టభద్రులు, 13మంది ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణారావు సందర్శించారు. కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, రమేష్, నరహరి సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఓదెల: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ లకు పోలింగ్ సరళి స్థానిక ఎన్నికలను మరిపిం చాయి. మొత్తం ఓటర్లు 1796 కాగా ఇందులో 1311 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

గెలిచిన అభ్యర్థి లక్ష్యంతో అభివృద్ధి చేయాలి

- రాగిడి మంగ, శ్రీనివాసరెడ్డి (జీలకుంట)

ఎమ్మెల్సీగా గెలిచిన అభ్యర్థి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని అభివృద్ధిపై దృష్టి చూపాలి. పట్టభద్రు ల ఎమ్మెల్సీ పోలింగ్‌లో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకొన్నా. పట్టభద్రుల సమస్యలు, ఉద్యోగ నియామకాలను చేపట్టేందుకు శాసనమండలిలో గళమెత్తాలి.


రామగిరి పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్న పట్టభద్రులు

ధర్మారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లు భారీగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడు పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్లతో నిండిపోయాయి. బంజేరుపల్లి తండాకు చెందిన భూక్య సంతోష్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా స్ట్రేచర్‌పై బంధువుల సాయంతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నాడు. దివ్యాంగులకు, పిల్లల తల్లులకు పోలింగ్ అధికారి వకీల్, ఆర్‌ఐ వరలక్ష్మిలు సహాయపడ్డారు. ఓటింగ్ సరళిని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరిశీలించారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో ఓటర్లు సాయంత్రం 5.30గంటల వరకు ఓటుహక్కు వినియోగించుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా మొత్తం ఓటర్లు 1538మంది ఉండగా 1168మంది పట్టభద్రులు, 21మంది ఉపాధ్యాయులకు 20మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. దివ్యాంగ ఓటర్లకు వీల్‌చైర్ సహాయంతో ఓటు వేయించారు. పోలింగ్ కేంద్రాన్ని సెక్టర్ ఆఫీసర్ జగదీశ్వర్‌రావు, సీఐ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు ఓటింగ్ సరళిని పరిశీలించారు.

కమాన్‌పూర్: పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 867మందికి 679మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం 78.31శాతం నమోదైంది. టీచర్స్ ఓటర్లు 20మంది ఉండగా 19మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎస్సై కొట్టె ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాద్, తహసీల్దార్ వాసంతి పరిశీలించారు.

పాలకుర్తి: బసంత్‌నగర్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 1070 మంది పట్టభద్రులుండగా 721 ఓట్లు పోలైయ్యాయి. ఉపాధ్యాయ ఓటర్లు 7 ఉండగా 7 గురు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఐ కె ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మంథని: మంథని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పట్టభద్రుల స్థానానికి రెండు, ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 2121 మంది పట్టభద్రులకు గాను 1453 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 73.25 శాతం నమోదైంది. అలాగే ఉపాధ్యాయులకు 92 మందికి గాను 90 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా 97.82 శాతంగా నమోదైంది. పోలింగ్ కేంద్రం ఎదుట ఎండ ఉండటంతో ఓటర్లు గంటల తరబడి క్యూలో నిలబడి నిరసించి పోయారు. దాదాపు 3 నుంచి 5 గంటలు ఓటర్లు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. మరికొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండేదని, కనీసం నీడ, తాగునీటి సదుపాయం కల్పించలేదని ఓటర్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు దుద్దిళ్ళ శ్రీనుబాబు నాయకులు వొడ్నాల శ్రీనివాస్, రమ-సురేష్‌రెడ్డి, శశిభూషన్ కాచే, ఐలి ప్రసాద్, కుడుదుల వెంకన్న, ఆరెల్లి కిరణ్‌ల ద్వారా ఆరా తీశారు. బీజేపీ శిబిరంలో మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రు పట్ల సునీల్‌రెడ్డి, నాంపెల్లి రమేష్, రాపర్తి సంతోష్, సబ్బని సంతోష్‌లు ఉన్నారు.

రామగిరి: రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 1278 ఓట్లకుగాను 901లను పట్టభద్రుల ఓటుహక్కు వినియోగించుకున్నారు. టీచర్స్ ఓట్లు 42 ఉండగా 36 ఓట్లు పోలైనట్లు మండల ఎలక్షన్ అధికారి మధూసూధన్‌రెడ్డి తెలిపారు.

ముత్తారం: మండల కేంద్రంలోని జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులు 754 మందికి 584, ఉపాధ్యాయులు 17 మంది ఉండగా 15 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. మొత్తం 77.34శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఎస్సై గోపతి నరేష్ బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాన్ని పటిష్టంగా నిర్వహించారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో గ్రాడయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 66.5శాతం పోలింగ్ నమోదైంది. 9,273ఓటర్లకు 6,125మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోదావరిఖని సెక్రర్డ్ హార్ట్ హైస్కూల్, రామగుండం జెడ్‌పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలు పెట్టారు. ఈ ఎన్నికల్లో టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లకు నాలుగు రోజుల ముందుగానే ఒక ప్రధాన రాజకీయ పార్టీ ఓటుకు రూ.5వేల చొప్పున డబ్బులు పంపిణీ చేయడంతో గ్రాడ్యుయేట్ ఓటర్లు కూడా దానిపై దృష్టిపెట్టారు. ఒక రాజకీయ పార్టీ ఓటుకు రూ.1000 కొన్ని ఓట్లకు డబ్బులు ఇవ్వడంతో మాకు కూడా డబ్బులు ఇవ్వండి అంటూ ఓటర్లు ఒత్తిడి చేశారు. సెక్రర్డ్ హార్ట్ హై స్కూల్‌లో ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 94.13శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పోలింగ్ సరళిని పరిశీలించారు.

మొదటిసారి ఓటు హక్కు...

ఉప్పులేటి శివాణి, ట్రాన్స్‌జెండర్, గోదావరిఖని

మొదటిసారి పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరూ కూడా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కుతో సరైన నాయకుడిని ఎన్నుకొని దేశ, రాష్ట్ర ప్రగతికి ముందడుగు వేయాలి. మోడల్ అవెర్నెస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలిగా, జిల్లాలో నా ఒక్కదానికి ఓటు హక్కు రావడం గర్వం ఉంది.

అంతర్గాం: అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 549మంది ఓటర్లు ఉండగా 365 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోగా 66శాతం పోలింగ్ నమోదైంది. టీచర్స ఎమ్మెల్సీ ఓటర్లు 12మందికి గాను 12మంది టీచర్లు ఓటు హక్కు వినియోగించుకొన్నారు. పోలింగ్ కేంద్రా లను సందర్శించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పోలింగ్ సరళిని పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు బీజేపీ ఏజెంట్‌లను బెదిరించారని కందుల సంధ్యారాణి ఆరోపించారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టభద్రులు 1198 మందికి 829 మంది, ఉపాధ్యా యులు 13 మందికి అందరు ఓటు వేశారు. ఎస్‌ఐ సనత్ కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం సమీపంలో కాంగ్రెస్‌పార్టి నాయకులు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని బీజేపీ నాయకులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య గందరగోళం చోటుచేసుకుని తోపులాటకు దారితీసింది. ఎస్‌ఐ, పోలీసులు ఇరువర్గాల వారిని సముదాయించారు.

కళ్యాణ్‌నగర్: పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గోదావరిఖని సెక్రర్డ్ హార్ట్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులతో బీజేపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. సోమారపు అరుణ్‌కుమార్ కాషాయం జెండా ధరించి పోలింగ్ కేంద్రానికి వెళుతుండగా గేటు వద్ద ఎస్‌ఐ భూమేష్, సిబ్బంది అడ్డుకున్నారు. కండువా తీసి లోపలికి వెళ్లాలని ఎస్‌ఐ అనడంతో బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఇది పార్టీ జెండాకాదని, కండువా అని, అనుమతించాలని వాగ్వాదానికి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం బీజేపీ నాయకులు వెనుదిరిగారు.


ఓటు వేసిన బీజేపీ నాయకుడు కుమార్

పోలింగ్ పదనిసలు...

- **చంటి పిల్లలతో పోలింగ్ కేంద్రాలకు..**

చాలా మంది మహిళా ఓటర్లు చంటి పిల్లలతో ఓటు వేయడానికి కేంద్రాలకు వచ్చారు. క్యూలైన్లు ఎక్కువ గా ఉండడంతో వారు చిన్నారులతో కలసి వేచి ఉండక తప్పలేదు. దివ్యాంగులు ఓటు వేసేందుకు రాగా వారికి సిబ్బంది వీల్ చైర్లను సమకూర్చి సహాయపడ్డారు.

- **ఓటు కు రూ. 1500**

పట్టభద్రుల ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజుల నుంచి కొందరు నాయకులు, మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పట్టభద్రులను ఇక్కడికి రప్పించుకొని, ఓటుకు రూ.1500 చొప్పున డబ్బులను పంపిణీ చేసినట్లు గ్రామస్తులు నుంచి ఆరోపణలు వచ్చాయి.

- **న్యూస్ పేపర్ సైజ్‌లో బ్యాలెట్**

పోలింగ్ కేంద్రాలు సెల్‌ఫోన్లు అనుమతించక పోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. బ్యాలెట్ పేపర్ చూసి ఓటర్లు ఒక్కసారిగా కంగుతిన్నారు. బ్యాలెట్ పేపర్ ఇంచుమించు న్యూస్ పేపర్ సైజ్‌లో ఉందని, అందులో తాము ఓటు వేసే అభ్యర్థి పేరు, ఫోటో వెతకటం ఇబ్బందికరంగా పరిగణించిందన్నారు..

- **పార్టీ నేతల కార్యకర్తల కోలాహలం**

పోలింగ్ కేంద్రాల సాధారణ ఎన్నికల మాదిరిగా పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఓటు వేసేందుకు వచ్చే అభ్యర్థులకు తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. పోలింగ్ కేంద్రాలు సమీపంలో ఆయా పార్టీల నేతలు పార్టీ కండువాలు కప్పుకుని ఓటు వేసేందుకు వెలుతున్న వారిని తమ అభ్యర్థికి ఓటు వేయాలని వారు సూచించారు.

- **శివరాత్రి ఎఫెక్ట్.. మధ్యాహ్నం నుంచి క్యూ**

శివరాత్రి పండుగ తెల్లవారి ఎమ్మెల్సీ పోలింగ్‌తో కొంత ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉపవాసం, జాగారం ఉండడం, గురువారం ఉపవాస విరమణ అనంతరం ఓటర్లు తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా మధ్యాహ్నం వరకు రద్దీ లేదు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు.


ఖనిలో ఓటు హక్కు వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్లు


పెద్దపల్లి జూనియర్ కళాశాలలో బారులు తీరిన పట్టభద్రులు




ధర్మారం, కాల్వశ్రీరాంపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగులు

బొగ్గు నాణ్యతపై సమీక్షా సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బొగ్గు నాణ్యతపై గురువారం ఆర్జీ-2 అధికారులతో జీఎం బండి వెంకటయ్య సమావేశం నిర్వహించారు. జీఎం ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో క్వాలిటీ డిప్యూటీ మేనేజర్ సుభాష్ రోజు వారి ఓసీపీ-3 బొగ్గు నాణ్యత వివరాలను తెలియజేశారు. జీఎం మాట్లాడుతూ పెరుగుతున్న పోటీ ప్రపంచంలో వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలన్నారు. నాణ్యతతోనే మార్కెట్‌లో పోటీని తట్టుకుని నిలబడతామని పేర్కొన్నారు. ప్రధానంగా బొగ్గులో మట్టి, షెల్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఎస్వోటూ జీఎం రాముడు, వీకేపీ గని ఏజంట్ నెహ్రూ, ఓసీపీ-3 మేనేజర్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య



సహాయక చర్యల్లో సింగరేణి రెస్క్యూ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎమెర్జెన్సీ సొరంగం (ఎస్ఎల్‌బీసీ) సహాయక చర్యల్లో పాల్గొనేందుకు గురువారం సింగరేణి రెస్క్యూ బృందాలు తరలివెళ్లాయి. సీఎండీ ఆదేశాల మేరకు 16 మందితో కూడిన బృందం టన్నెల్‌లో చిక్కుకున్న వారిని రక్షించే చర్యల్లో ఇప్పటికే పాల్గొంటున్నారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా 100 మంది బృందం గురువారం శ్రీశైలం టన్నల్ వద్దకు బయలుదేరింది.

చిన్న పరిశ్రమల కోసం బొగ్గు ధర తగ్గించాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బొగ్గు ఆధారిత పరిశ్రమలు మనుగడ సాగించాలంటే సింగరేణి సంస్థ బొగ్గు ధరను తగ్గించాల్సిన అవసరం ఉందని విద్యుత్తేతర పరిశ్రమల యాజమాన్యాలు సింగరేణి సంస్థకు మొర పెట్టుకున్నాయి. తమపై ఆధారపడిన వేల మంది ఉద్యోగుల భవిష్యత్ దృష్ట్యా తక్కువ ధరకు బొగ్గును విదేశాల నుంచి లేదా ఇతర బొగ్గు సంస్థల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. అన్ని ఏరియాల జీఎంలు, క్వాలిటీ జీఎంలు, క్వాలిటీ ఇన్‌చార్జిలతో కలిసి సింగరేణి భవన్‌లో గురువారం విద్యుత్తేతర వినియోగదారుల సమావేశంలో పాల్గొన్నారు. గత ఏడాది సింగరేణి ఉత్పత్తి చేసిన 70మిలియన్ టన్నుల బొగ్గులో 9మిలియన్ టన్నులను విద్యుత్తేతర వినియోగదారులు కొనుగోలు చేశారని, ఈ ఏడాది కేవలం 5మిలియన్ టన్నులను మాత్రమే తీసుకోవడానికి కారణాలను సీఎండీ ఎన్ బలరాం తెలుసుకున్నారు. దీనిపై అన్ని సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ సింగరేణి బొగ్గు ధరలు ఎక్కువ ఉన్నందున తాము అంతకన్నా తక్కువ ధరకు లభిస్తున్న కోలిండియా, విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపాల్సి వస్తుందని పేర్కొన్నారు. దూర ప్రాంతాల నుంచి బొగ్గును కొనుగోలు చేస్తున్నప్పటికీ సింగరేణి ధరతో పోల్చితే తక్కువకే లభిస్తోందన్నారు. నాణ్యత విషయంలోనూ లేవనెత్తిన అంశాలపై అధికారులకు సీఎండీ ఎన్ బలరాం ఆదేశాలు జారీ చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను, సింగరేణి మార్కెట్‌ను రక్షించుకునేందుకు అవసర మైన అన్ని చర్యలపై సమాలోచనలు జరిపి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. నవభారత్, ఐటీసీ, ఓరియంట్ సిమెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, దివీస్ ల్యాబరేటరీస్, హెటిరో ఫార్మా, సిర్పూర్ పేపర్ మిల్స్ తదితర సంస్థల నుంచి ప్రతినిధులు, సింగరేణి డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు (ఈఅండ్ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), ఎగ్జిక్యూటివ్ కోల్ మూమెంట్ ఎస్‌డీఎం సుభాని, జీఎం(మార్కెటింగ్) డీ రవిప్రసాద్, జీఎం(సీపీపీ) మనోహర్, ఓఎస్‌డీ (మార్కెటింగ్) ఎన్‌వీ రాజశేఖరరావు, డీజీఎంలు సురేందర్ రాజు, శ్రీవాస్తవ, అడిషనల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

రెండో రోజు న్యాయవాదుల నిరసనలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గోదావరి ఖనికి చెందిన న్యాయవాది కిరణ్‌జీపై వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి దురుసుగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. దీంతో మూడు కోర్టుల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. అనం తరం అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షురా లు చందాల శైలజ మాట్లాడుతూ సీఐ న్యాయ వాది పట్ల దురుసుగా ప్రవర్తించడం గర్హనీయ మని, క్షమాపణ చెప్పాలన్నారు. ఐలూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఉమర్, పట్టణాధ్యక్షుడు ఆసంపల్లి రవీందర్, రాంటెంకి శ్రీనివాస్, షాహనావజ్, శ్రీలత, రేష్మా, శీతకారి చంద్రశేఖర్, పులిపాక రాజ్‌కుమార్ పాల్గొన్నారు. న్యాయవాదులు చేస్తున్న ఆందోళనలకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి సంఘీభావం తెలి పారు. బాలుడిని అదుపులోకి తీసుకున్న విషయమై మాట్లాడేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాది పట్ల సీఐ దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. నాయవాదులు సత్యనారాయణరెడ్డి, మురళీధర్‌యాదవ్, రాకం దామోదర్, మహేష్, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి పాల్గొన్నారు.


కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వైభవంగా అయ్యప్పస్వామి శోభాయాత్ర

మంథని, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం గోదావరి నదిలో స్వామి ఉత్సవ విగ్రహానికి భక్తులు చక్రస్నానం చేయించారు. ఆలయంలోని స్వామి మూల విరాట్‌కు పంచామృతాలు, వివిధ రకాల పూలు, సుగంధ ద్రవ్యాలు, పసుపు, కుంకుమలతో ఆలయ పూజారులు నాగేశ్వరశర్మ, భద్రయ్యగురుస్వాముల ఆధ్వర్యంలో అభిషేకాన్ని నిర్వహించారు. స్వామి శరణుగోషతో భక్తులు నినాదాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రం పూలతో అలంకరించిన రథంపై శోభయాత్రను నిర్వహించారు. మహిళల కోలాట బృందాలు, అయ్యప్ప డీజే పాటలకు భక్తుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాలకుర్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జీడీనగర్ ప్రాంతంలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు నాలుగవ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కల్వల సం తోష్ గురువారం తెలిపారు. ఈనెల 21న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 27వ తేదీనుండి మార్చి 2 వరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు అఖిలే శ్వర్, బరత్ చంద్ర,కేసిద్ధార్థ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెం ట్ ఇస్మాయిల్,సయ్యద్ అఫ్జల్‌లు విద్యార్థులను అభినందించారు.

దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీదే విజయం

పెద్దపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించినా బీజేపీ విజయం సాధిస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో దుగ్యాల ప్రదీప్‌కుమార్, గోమాసే శ్రీనివాస్‌లు మాట్లాడుతూ రెండు పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారన్నారు. రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, 420 హామీలు, ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. పోషం, శిలారపు పర్వతాలు, రాజేశ్వరరావు, సంపత్‌రావు, మేకల శ్రీనివాస్, రాజగోపాల్, తిరుపతి, పాల్గొన్నారు.